ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
శుక్రవారం 18 జూలై 2025

బెట్టింగ్ యాప్‌లో డబ్బు పోయినందుకే..
బీటెక్ విద్యార్థి ఆత్మహత్య 6

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు
● పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కారాగార శిక్ష


సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న న్యాల్‌కల్ కేజీబీవీ విద్యార్థినులు

కేజీబీవీ బాలికలకు అస్వస్థత

న్యాల్‌కల్‌లో ఐదుగురి విద్యార్థినులు దగ్గు, శ్వాస సమస్యలతో సతమతం

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో చికిత్స
వైద్యుల పర్యవేక్షణలో బాలికలు
విద్యార్థులు ధైర్యంగా ఉండాలి
డీఈవో వెంకటేశ్వర్లు పరామర్శ

సంగారెడ్డి అర్బన్/న్యాల్‌కల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో(కేజీబీవీ) ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడి కస్తూర్బాలో ఎనిమిదో తరగతి చదువుతున్న స్వప్నబాయి, పూజ, మీనాక్షి, సాక్షి, సోనాబాయి బుధవారం రాత్రి దగ్గు, శ్వాస సమస్యతో బాధపడగా వారిని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వారిని సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పీడియాట్రిక్ ఐసీయూలో చేర్పగా, వైద్య బృందంతో చికిత్స అందిస్తున్నారు. ప్రతీ విద్యార్థినికి రక్త పరీక్షలతో పాటు ఎక్స్‌రే, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. బాలికల ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం ఏమీ లేదని, భయపడాల్సిన అవసరం ఏ మాత్రం లేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ తెలిపారు. కాగా, ఎంసీహెచ్‌లోని చికిత్స పొందుతున్న బాలికలను డీఈవో వెంకటేశ్వర్లు, కేజీబీవీ అధికారులు సుప్రియ, మాధవి పరామర్శించారు. అలాగే, న్యాల్‌కల్ కేజీబీవీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. డీఈవో వెంకటేశ్వర్లు కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలన్నారు. సిబ్బంది విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందుల తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

గతేడాదీ ఇదే సమస్యతో ఇక్కడికి

ఇదే న్యాల్‌కల్ కేజీబీవీ విద్యార్థినులు గతేడాది అక్టోబరు నెలలో తీవ్ర దగ్గు, ఆయాసం, శ్వాస కోశ సమస్యలతో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. తాజాగా అదే కేజీబీవీ నుంచి వారే ఐదుగురు విద్యార్థినులు మళ్లీ దగ్గు, శ్వాస సమస్యలు రావడం గమనార్హం. బాలికలు తరుచూ ఇటువంటి అనారోగ్య సమస్యలతో ఎందుకు గురవుతున్నారనే కోణంలో వైద్యులు విశ్లేషిస్తున్నారు. కాగా చికిత్స పొందుతున్న బాలికలకు సైకియాట్రిక్ వైద్యులు కౌన్సెలింగ్ ఇచ్చారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.


ఓటర్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు దొంగ ఓట్లకు చెక్ పెట్టేందుకు ఎన్నికల సంఘం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. బీహార్‌లో విజయవంతమైన 'నజారి నక్ష' విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నది. పోలింగ్ బూత్ అధికారుల(బీఎల్‌వోలు)కు ఈ విధానంపై విస్తృతంగా శిక్షణ ఇస్తున్నారు. ఓటర్ల సర్వే సందర్భంగా మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, మృతులు, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడంపై ప్రధానంగా దృష్టి సారించారు.


బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న అధికారి

నజారి నిఘా

దొంగ ఓట్ల ఏరివేతకు సరికొత్త విధానానికి శ్రీకారం

ఓటర్లకు మెరుగైన సౌకర్యాలు, పకడ్బందీ జాబితాకు ఈసీ కసరత్తు
పోలింగ్ బూత్ యూనిట్‌గా మ్యాప్
త్వరలో ఇంటింటి సర్వే ప్రారంభం



రామచంద్రాపురం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం పోలింగ్ బూత్‌ను యూనిట్‌గా చేసుకొని నజారి నక్ష మ్యాప్‌లను రూపొందించింది. కుటుంబ సభ్యులందరూ ఒకే బూత్‌లో ఓటు వేసేలా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. పోలింగ్ బూత్ పరిధిలోని కాలనీల వివరాలను సేకరించి, 1200 మంది ఓటర్లు ఒకే ప్రాంతంలో నివసిస్తే వారికి ప్రత్యేక బూత్‌ను కేటాయిస్తున్నారు. 1200కు మించిన ఓటర్లు ఉంటే పక్కనే మరో బూత్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉన్న 422 పోలింగ్ బూత్‌లకు నజారి నక్ష మ్యాప్‌ల అనుసంధానం కారణంగా అదనంగా మరో 93 బూత్‌లు రానున్నాయి. ఓటర్లు తమ ఇల్లు నజారి నక్ష మ్యాప్‌లో ఉందా లేదా అని సరిచూసుకోవచ్చు.

ఈ నెల 25 నుంచి ఇంటింటి సర్వే

ఓటర్ల జాబితాలో ఉన్నవారు నిజంగా నివాసం ఉంటున్నారా లేదా అని నిర్ధారించుకునేందుకు ఈ నెల 25 నుంచి మిగతా 8వ పేజీలో

పటాన్‌చెరు నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్ల తొలగింపునకు అవకాశం

పటాన్‌చెరు నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలసలు వచ్చిన వారు ఉన్నారు. దీంతో ఏటేటా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మృతులు, అద్దెకు ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించే ప్రక్రియను ఈసీ చేపట్టింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 4,21,099 మంది ఓటర్లున్నారు. ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి, బొంతపల్లి, గడ్డపోతారం, అమీన్‌పూర్ పురపాలక సంఘం, ఇస్నాపూర్, పటాన్‌చెరు పట్టణం, చిట్కూల్, రామచంద్రాపురం పట్టణాల్లో ఓటర్ల తొలగింపు భారీగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో శ్మశానవాటికకు ఇచ్చిన ఇంటి నంబర్ ఆధారంగా బీహార్‌కు చెందిన ఓ వ్యక్తికి ఓటరు కార్డు జారీ అయిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకొని, దొంగ ఓటర్లు లేకుండా జాబితాను పకడ్బందీగా రూపొందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మీడియా జోలికి వస్తే ఊరుకోం
మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు 7

అన్యాయానికి గురవుతున్న గిరిజనులు
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ 7

కూలి పనులకు బాలిక.. అడ్డుకున్న ఎంఈవో
కేజీబీవీలో చేర్పిస్తామని హామీ 7

రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను పరిష్కరించాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య


వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

మునిపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతిలో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం ఆమె మునిపల్లిలోని పీహెచ్‌సీని, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వార్డులను, రిజిస్టర్‌ను తనిఖీ చేసి, రోగులతో ముచ్చటించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి భూ భారతి ప్రోగ్రెస్, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితర వాటిపై తహసీల్దార్, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం బుదేరాలోని ఫార్మ ఫండ్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచులు రమేష్ గౌడ్, సలావుద్దీన్ మునిపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రోడ్డు వేయించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నల్లవాగు ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌లో సర్వే


నల్లవాగు ఎఫ్‌టీఎల్ భూముల్లో సర్వే చేస్తున్న అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్హేర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు మధ్య తరహా ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌లో కబ్జాకు పాల్పడిన భూముల్లో నీటిపారుదల శాఖ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. 16న 'ఆంధ్రజ్యోతి'లో కబ్జాపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ కబ్జాపై పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ప్రాజెక్టు ఏఈలు శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లేష్ గురువారం ఎఫ్‌టీఎల్ భూముల్లో సర్వే నిర్వహించారు. పరీవాహక ప్రాంత రైతులు కట్టలు వేసి కబ్జాకు పాల్పడిన భూములు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ కబ్జాలకు పాల్పడిన రైతులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆలస్యమైనా ప్రాజెక్టుపై భాగంలోనూ సర్వే జరిపి ఎఫ్‌టీఎల్ భూములను కాపాడాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరారు.

రాష్ట్ర ఆదాయం మిత్తికే సరి

ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా పథకాలను అమలు చేస్తున్నాం
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది
రాష్ట్ర కార్మిక శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి


నర్సాపూర్‌లో కొత్త రేషన్‌కార్డులు అందజేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్/మెదక్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆదాయం ప్రస్తుతం మిత్తి కట్టడానికే సరిపోవడం లేదని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్క హామీని నిలబెట్టుకుంటుందని రాష్ట్ర కార్మిక శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం ఆయన నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణ లక్ష్మి చెక్కులు, కొత్తగా మంజూరైన 2,508 రేషన్‌కార్డులు, మహిళ సంఘాలకు రుణాల చెక్కుల పంపిణీతో పాటు పంచాయతీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మెదక్‌లో మహిళా శక్తి సంబరాలు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.8 లక్షల కోట్లు భారాన్ని మిగతా 8వ పేజీలో

నాలుగు కార్లు ఢీ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం నర్సాపూర్‌కు విచ్చేస్తుండగా నాయకుల కార్లు ప్రమాదానికి గురయ్యాయి. మంత్రి కాన్వాయ్‌ను అనుసరిస్తున్న స్థానిక నాయకుల కార్లలో ఒక్క కారు సడన్‌గా బ్రేక్ వేశారు. దీంతో ఒక్కదాని వెనుక ఒకటి నాలుగు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్‌నాయక్ కారుతో పాటు మరో ముగ్గురు నాయకుల కార్ల ముందు భాగాలు కొద్దిగా దెబ్బతిన్నాయి.


మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో మంత్రి గడ్డం వివేక్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తదితరులు

రెండు కళ్లలా అభివృద్ధి, సంక్షేమం

● మెదక్ జిల్లాకు సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం
● పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

మెదక్ అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా కొనసాగుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో మెదక్‌లో గురువారం నిర్వహించిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లా అభివృద్ధికి సమృద్ధిగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణను లూటీ చేసింది కేసీఆర్ అంటూ వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని క్లీన్‌స్వీప్ మిగతా 8లో

ఎడమ కాలువ ఆధునీకరణకే క్రాప్ హాలిడే

● ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదు : మంత్రి దామోదర్

పుల్‌కల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టు స్థిరీకరణలో భాగంగా ప్రధాన ఎడమ కాలువ మరమ్మతుల కోసమే గతేడాది క్రాప్ హాలీడే ప్రకటించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం ఆయన కాంగ్రెస్ యువ నాయకురాలు త్రిషతో కలిసి వానకాలం వరి పంట సాగుకు మోటార్ స్విచ్చాన్ చేసి సింగూరు జలాలను విడుదల చేశారు. దిగువకు ప్రవహిస్తున్న నీటిలో పూలు చల్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల్లో మొలచిన గడ్డి, ముళ్ల చెట్లను తొలగించిన పాపాన పోలేదని విమర్శించారు. ఎడమ కాలువతో పాటు ఇతర డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఆధునికీకరించేందుకు నిధులు మంజూరు చేశానని గుర్తుచేశారు. అనంతరం మంత్రి సింగూరు గురుకుల పాఠశాల, కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, కేజీబీవీను సందర్శించారు.


పూలు చల్లుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

బేబీ తళుక్కులు

మెదక్‌లో 'బేబీ'లు తళుక్కుమనిపించారు. గురువారం పట్టణంలో చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా బేబీ సినిమా ఫేం హీరోయిన్ వైష్ణవి చైతన్య, జబర్దస్త్ ఫేం వర్ష సందడి చేశారు. షాపింగ్‌మాల్‌ను ప్రారంభించి మాల్‌లో వస్త్రాలను పరిశీలించారు. వారితో సెల్ఫీలు దిగడానికి అభిమానులు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- మెదక్ అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి)


హీరోయిన్ వైష్ణవి చైతన్య


బుల్లితెర నటి వర్ష

బీఆర్ఎస్ నాయకుడికి బెదిరింపు కాల్స్

● పోలీసులకు రంజిత్‌నాయక్ ఫిర్యాదు

హవేళిఘణపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్కూల్‌తండాకు చెందిన బీఆర్ఎస్ గిరిజన నాయకుడు రంజిత్‌నాయక్ తనకు ఎమ్మెల్యే రోహిత్ రావు అనుచరుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరుడు మెదక్ పట్టణానికి చెందిన ఖైసర్ బిన్ అబ్దుల్లా రాత్రి 11 గంటలకు వాట్సాప్ కాల్ చేసి కులం పేరుతో దూషించడమే కాకుండా చంపేస్తానని, సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌కు సంబంధించిన ఎలాంటి ఫొటోలు, వీడియోలు పెట్టొద్దని బెదిరించాడని, అతడి వల్ల తనకు ప్రాణహాని ఉన్నదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట శ్రీనునాయక్, ఫుల్‌సింగ్, తరుణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

● సంగారెడ్డి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటలక్ష్మి

కంది, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని సంగారెడ్డి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) వెంకటలక్ష్మి అన్నారు. గురువారం కందిలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పీఏసీఎస్‌లో ఉన్న యూరియా స్టాక్, విత్తనాలను ఆమె పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా, విత్తనాలు కొరత లేకుండా చూడాలని చైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాణాలో కారుతో ఢీ

● భూ వివాదంతో వైరం..
ప్రాణభయంతో పరుగుపెట్టిన వ్యక్తి
● వెంబడించి మరీ ఘాతుకం



పోలీస్‌స్టేషన్‌లో కారు

కొమురవెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వారిద్దరి మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. గురువారం ఓ వైన్స్ పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా, ప్రత్యర్థి వచ్చి కత్రలతో దాడి చేశాడు. అతను ప్రాణభయంతో పరుగున పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, కారులో వెంబడించి ఢీ కొట్టాడు. ఈ ఘటన మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన ఆలేటి రాంరెడ్డికి అదే గ్రామానికి చెందిన నాయిని ప్రతాప్‌రెడ్డికి కొంత కాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఆలేటి రాంరెడ్డి గురువారం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఓ వైన్స్ పర్మిట్ రూంలో మద్యం తాగుతున్నాడు. నాయిని ప్రతాప్‌రెడ్డితో పాటు మరొకరు అక్కడికి వచ్చి రాంరెడ్డిపై కత్రలతో దాడిచేశారు. ప్రాణభయంతో రాంరెడ్డి దగ్గరలోనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీయగా, ప్రతాప్‌రెడ్డి కారులో వెంబడించి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న రాంరెడ్డిని ఢీ కొట్టాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేయగా, తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రాంరెడ్డికి గాయాలు అయ్యాయి. పోలీసులు వచ్చి కారుతో ఢీకొన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎస్సై రాజు గౌడ్‌ను సంప్రదించగా, ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నారని, కారుతో ఢీ కొట్టిన వ్యక్తిని అదుపులో తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

సంగారెడ్డి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, గిరిజన తండాల్లో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించడం తగదని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు బానోత్ హుస్సేన్ అధికారులను హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, గిరిజనతండాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. గిరిజనతండాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. జాతీయ ఎస్సీ కమిషన్ వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గిరిజన బిడ్డలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు. తండాలకు తాగునీటి వసతితో పాటు రోడ్ల సౌకర్యాల కల్పనకు అధికారులు ముందు దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ జ్యోతి, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, బీసీ సంక్షేమాధికారి రామాచారి, డీఎంహెచ్‌వో డా.గాయత్రి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి వసంతకుమారి, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ అధికారి దినేష్, అదనపు డీఆర్డీవో బాల్‌రాజ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లో డబ్బు పోయినందుకే..
బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



అజ్మీరా తరుణ్ (ఫైల్)

నర్సాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు రూ. 40 వేలు పంపించారు. అవి కాస్త బెట్టింగ్ యాప్‌లలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలో అన్న వేదనో ఏమోగాని బీటెక్ చదువుతున్న విద్యార్థి తాను ఉండే ప్రైవేట్ హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న కారణాలను పోలీసులు కనుగొన్నారు. ఎస్సై లింగం కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుత్లూర్ గ్రామానికి చెందిన అజ్మీర తరుణ్(18) నర్సాపూర్ సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ సెంకడీయర్ చదువుతూ, నర్సాపూర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. 20 రోజుల క్రితం తల్లిదండ్రులు చదువు, ఇతర ఖర్చుల కోసం రూ. 40వేలు పంపించారు. అవి బెట్టింగ్ యాప్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం హాస్టల్ గదిలో ఉరి వేసుకున్నాడు. అతని సోదరుడు ఉదయ్‌కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా భూమిని కబ్జా చేస్తున్నారు

● ఉన్నతాధికారులకు భూ యజమాని ఫిర్యాదు

పటాన్‌చెరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో బీడీఎల్ ఎస్‌హెచ్‌వో ఓ వర్గానికి మద్దతు పలుకుతున్నాడని భూయజమాని నల్లగుండ్ల నర్సింగ్‌గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాటిల్లోని తన ప్లాట్‌ను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో ఏడీ సర్వే కూడా తమకు అనుకూలంగా ఉందని అన్నారు. అయినా, ఎస్‌హెచ్‌వో ప్రత్యర్థులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. దీనిపైన ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు. ఈ విషయమై బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ మాట్లాడుతూ సివిల్ విషయాలు కోర్టులో తేల్చుకోవాలని చెప్పామని, ఇరువర్గాల మధ్య గొడవ జరిగిన నేపథ్యంలో కేసులు నమోదు చేశామన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

● నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన పోక్సో కోర్టు

గుమ్మడిదల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలిక ఇంట్లో ఉండగా, వృద్ధుడు చాకెట్లు ఇప్పిస్తానని ఆశపెట్టాడు. ఏమీ తెలియని ఆ బాలిక అతడి వెంట వెళ్లిన ఆమెపై లైంగిక వేధిపులకు పాల్పడ్డాడు. ఈ కేసులో పదేళ్ల తర్వాత నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి జయంతి గురువారం తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఎస్సై భరత్ భూషణ్ వివరించారు. జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుమ్మడిదల మండలంలో ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వారి ఇంటి పక్కనే ఉండే కేల్లా సూర్యారావు చాకెట్లు ఇప్పిస్తానని ఆశపెట్టి తీసుకెళ్లి, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు జిన్నారం పోలీసులకు ఫిర్యాదు అందగా, అప్పటి ఎస్‌హెచ్‌వో లాలూనాయక్ కేసు దర్యాప్తు చేశారు. న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయగా, పదేళ్ల తర్వాత గురువారం కోర్టు నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఘటన జరిగిన సమయంలో నిందితుడి వయస్సు 55 ఏళ్లు కాగా, ఇప్పుడతని వయస్సు 65. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నూర్‌రెడ్డి, విచారణాధికారి లాలూనాయక్, ప్రస్తుత ఎస్సై భరత్‌భూషన్, కోర్ట్ లైజనింఘ్ అధికారి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, కె. సత్యనారాయణలను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

తెగి పడిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం



ట్రాన్స్‌కో అల్లాదుర్గం లైన్‌మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అల్లాదుర్గం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగ తెగిపడి తృటిలో ప్రమాదం తప్పిన ఘటన పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం జరిగింది. పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఉన్న తీగ గురవారం తెగి పడింది. ఆ సమయంలో అటుగా ఇద్దరు వెళ్తుండగా, గమనించి పక్కకు జరగడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు కరెంట్ సరఫరా నిలిపివేసి స్థానిక లైన్‌మన్‌కు సమాచారం ఇచ్చారు. అతను రెండు గంటల అనంతరం రావడంతో అక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో, ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కల్లు దుకాణంలో ఇద్దరు ఘర్షణ

● కల్లు సీసాతో ఒకరిపై దాడి, పరిస్థితి విషమం

నర్సాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కల్లు దుకాణంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా.. కల్లు సీసాతో ఒకరు మరొకరిపై దాడిచేశారు. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌కు చెందిన వడ్ల నిరంజన్ బుధవారం సాయంత్రం కల్లు దుకాణంలో కల్లు సేవించడానికి వెళ్లాడు. అక్కడ అదే గ్రామానికి చెందిన వడ్ల శివ కనిపించగా.. నిరంజన్ తనకు శివ ఇవ్వాల్సిన డబ్బుల గురించి అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుని, ఒకరిపై ఒకరు దాడిచేసుకునే వరకూ వెళ్లింది. ఈ క్రమంలో శివ తన పక్కనే ఉన్న కల్లుసీసా తీసుకుని నిరంజన్‌పై దాడిచేశాడు. పక్కన ఉన్న వారు గమనించి ఇద్దరినీ విడిపించారు. తీవ్ర గాయాలపాలైన నిరంజన్‌ను నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురు గంజాయి నేరస్థుల బైండోవర్

సిద్దిపేట క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా కేసులో నిందితులైన నలుగురిని గురువారం ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. రూరల్ మండల పరిధికి చెందిన కాల్వ వెంకటేశ్, గట్టు వినీల్, పర్కపల్లి రామచంద్రం, కొండూరు అరవింద్ గంజాయి కేసుల్లో నిందితులు. వీరికి రూ.2 లక్షల జరిమానాతో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

నాలుగు టిప్పర్లు సీజ్

జోగిపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఎస్ఐ పాండు సీజ్‌చేశారు. జోగిపేట బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో కోకాపేటకు చెందిన నాలుగు టిప్పర్లు అక్రమంగా మట్టిని తరలిస్తున్నాయనే విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ పాండు తెలిపారు.

క్రైం కార్నర్

అయ్యో కనకమ్మ..

● కూలీకి వెళ్తూ కానరాని లోకాలకు..
● గురువన్నపేట వద్ద ఆటో బోల్తా, మహిళ మృతి



బోల్తా పడటంతో ధ్వంసమైన ఆటో, కనకమ్మ(ఫైల్)

జగదేవ్‌పూర్/కొమురవెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అందరితో కలిసి ఉండే కనకమ్మను ఆటో రూపంలో మృత్యువు కబళించింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన 15 మంది కూలీలు గురువారం ఆటోలో కొమురవెల్లి మండలం గురువన్నపేటలో నాటు వేసేందుకు బయలుదేరారు. గురువన్నపేట చౌరస్తాకు వెళ్లగానే ఆటోకు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ముందు భాగంలో డ్రైవర్ పక్కన కూర్చున్న కనకమ్మ కిందపడగా ఆమెపై ఆటో పడింది. దీంతో కనకమ్మ తలకు తీవ్రగాయాలు కాగా.. వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మరో నలుగురికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో అందరితో కలిసి ఉండే కనకమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో చేగుంట వాసి మృతి



రాములు(ఫైల్)

చేగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేగుంట వాసి మృతిచెందాడు. చేగుంట గ్రామానికి చెందిన మ్యాకల రాములు(55) విద్యుత్ మీటర్ల రీడింగ్ మిషన్లు సంబంధించి హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాములు మృతితో చేగుంట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సిగాచీ పరిశ్రమలో గాయపడ్డ మరో కార్మికుడు మృతి

● 46కు చేరిన మృతుల సంఖ్య

పటాన్‌చెరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో గాయపడ్డ మరో కార్మికుడు గురువారం మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన దయాకర్ బసక్ అనే కార్మికుడు మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 46కు చేరింది. ఇంకా పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం జరిగిన రోజు నుంచి కనబడని ఇంకో ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటి వరకు తెలియలేదు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుందరయ్య కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం, కవ్వంపల్లి గ్రామానికి చెందిన పూసల నాగరాజు, జ్యోతి(35)కి 2018లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం నగరానికి వచ్చి దూలపల్లిలోని అయ్యప్ప 60 గజాల్లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. నాగరాజు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, భార్య జ్యోతి ఇంట్లో ఉంటుంది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం, కట్నం డబ్బులు తీసుకురావాలని జ్యోతిని వేధించేవాడు. బుధవారం సాయంత్రం నాగరాజు పిల్లలను తీసుకు రావడానికి స్కూల్‌కు వెళ్లాడు. మనస్తాపానికి గురైన భార్య జ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాగరాజు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలు కుటుంబసభ్యులు ఈ మేరకు గురువారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుందరయ్య తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

హవేళిఘణపూర్/కొండపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. భర్త తిట్టాడని ఒకరు, ఆస్పత్రికి వెళ్తున్నానని మరొకరు కనిపించకుండా పోయారు. హవేళిఘణపూర్ మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన పచ్చంటి లక్ష్మిని భర్త ప్రసాద్ తిట్టాడు. దీంతో ఆమె మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712657921 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ డ్రైవర్. ఈ నెల 15న ఆయన సిద్దిపేటలో ఉండగా, అతని భార్య దివ్య ఆస్పత్రిలో చూపించకుంటానని భర్తకు ఫోన్ చేసింది. ఆటోలో రావాలని సూచించగా, వస్తున్నట్లు చెప్పింది. కుమార్తె కోమలిని తీసుకుని వెళ్లిన దివ్య సిద్దిపేటకు కానీ, ఇంటికి గాని రాలేదు. దీంతో టీహెచ్‌ఆర్ నగర్‌లోని ఆమె తల్లిగారింటి వద్ద, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగ డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం



దివ్యాంగ డ్రైవర్‌ను ఆటో నుంచి దింపుతున్న కార్మికులు

శివ్వంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి.. బతుకుదెరువు కోసం ఆటో నడిపించుకుంటున్న ఓ దివ్యాంగుడు మరోసారి ప్రమాదం బారిన పడ్డాడు. మండలంలోని బిజిలీపూర్‌లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు.. ఓ గిరిజన యువకుడికి గతంలో రోడ్డు ప్రమాదం జరగగా, కుడికాలు కోల్పోయాడు. ఆ తర్వాత ఆటో నడిపించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం బిజిలీపూర్ శివారులోని ఓ పరిశ్రమకు శివ్వంపేట నుంచి రెండు డ్రమ్ముల డీజిల్ లోడ్ చేసుకుని వెళ్లాడు. పరిశ్రమ వద్దకు వెళ్లగానే అక్కడ ఎత్తుగా ఉండటంలో ఆటో వెనుకకు లేచింది. అక్కడే ఉన్న పరిశ్రమ కార్మికులు వచ్చి ఆటోను పట్టుకున్నారు. దివ్యాంగ డ్రైవర్‌ను బయటికి తీశారు. దీంతో ప్రమాదం తప్పింది.

రూ.20కే రూ.2లక్షల బీమా

- ఉపాధి కూలీలకు పీఎంఎస్‌బీవై ఆర్థిక భద్రత
- ఈ నెలాఖరు వరకు గడువు
- 18-70 ఏళ్ల వయస్సుగల కూలీలు అర్హులు

కొండపాక, జూలై 17(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలుస్తుంది. పనిచేస్తున్న ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరితే బీమా ప్రయోజనం బాధితులు పొందనున్నారు. ఈ విషయాలను గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పథకం ఇతర సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకంలో చేరిన వారికి మరణించినా, పూర్తిగా అంగవైకల్యం కలిగినా రెండు లక్షల పరిహారం చెల్లిస్తారు. ఒకవేళ పాక్షికంగా అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయలు పరిహారం అందిస్తారు. కొండపాక మండలంలో సుమారు 6వేల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరడం కోసం ఈ నెల 31 వరకు గడువు విధించారు. ప్రత్యేక ఫారంలో కూలీల వివరాలన్నింటినీ నమోదు చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం ఈజీఎస్ సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.బీమా పథకంలో చేరడానికి 18 నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్నచోట కూలీలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. కూలీలు బీమా పథకంలో తమ పేర్లు నమోదు చేయించాక ఏటా ఖాతా నుంచి రూ.20 బీమాకు జమచేయాలని రాత పూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుంది.



కూలీలకు ప్రయోజనం

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో ఉపాధి హామీ కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రమాదం సంభవిస్తే బీమా అండగా ఉంటుంది. అందరూ సద్వినియోగం చేసుకునేలా ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

-ఎంపీడీవో వెంకటేశ్వర్లు



మెదక్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మీడియా జోలికి వస్తే ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మెదక్ అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడులను సహించేది లేదని, మరోసారి మీడియా జోలికి వస్తే.. బీఆర్‌ఎస్‌కు చెందిన టీన్యూస్, నమస్తే తెలంగాణపై దాడులు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు. గురువారం మెదక్ పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. డబ్బులు ఇచ్చి యూట్యూబ్‌లలో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్న బావ, బావమరుదులకు చుక్కలు చూపిస్తామని హన్మంతరావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేము ప్రజల్లో ఉండి వారి కష్టసుఖాలు తెలుసుకుంటే బీఆర్‌ఎస్ నేతలు ఇళ్లలో కూర్చుని యూట్యూబ్ ఛానెళ్లకు డబ్బులు ఇచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ దుకాణం బంద్ అయిందని, ఆ పార్టీకి చెందిన నేతలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గిందన్న భయంతో ప్రాంతం, కులం, మతం అని సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎలాంటి కుట్రలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావులతో వారి కుటుంబానికి చుక్కలు చూపిస్తామన్నారు.



బాలికను కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

కూలి పనులకు బాలిక.. అడ్డుకున్న ఎంఈవో

- కేజీబీవీలో చేర్పిస్తామని హామీ

కల్హేర్/సిర్గాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని జంలా తండా గ్రామ పంచాయతీ తోల్యా తండాకు చెందిన బాలిక కూలి పనులకు వెళ్తుండగా సిర్గాపూర్ ఎంఈవో నాగారం శ్రీనివాస్ అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రాథోడ్ శివరామ్, కవిత దంపతుల కూతురు చిట్టిబాయి 5వ తరగతి వరకు చదివి మధ్యలోనే చదువు మానేసి తల్లిదండ్రులకు తోడుగా కూలీ పనులకు వెళ్తుంది. గురువారం కూడా వెళ్తుండగా ఎంఈవో బాలికను గమనించి అడ్డుకున్నారు. పాఠశాలకు వెళ్లే వయస్సులో కూలీ పనులు చేయించడం నేరమని ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. సిర్గాపూర్ కేజీబీవీలో బాలికను చేర్పించి విద్యాభ్యాసం చేయిస్తామని తెలుపడంతో దానికి బాలిక చిట్టిబాయి తల్లిదండ్రులు సమ్మతించారు. ఆయన వెంట సీఆర్పీ శివకుమార్ ఉన్నారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనది

- ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేకాధికారి కిషన్

జోగిపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైనదని, , విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేకాధికారి కిషన్ అన్నారు. గురువారం ఆయన జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశలో తీసుకున్న నిర్ణయాలే తమ జీవితాలను మలుపుతిప్పుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులను అభినందించారు. కళాశాలలో 280 అడ్మిషన్లు కావడంపై హర్షం వ్యక్తం చేసి ప్రిన్సిపాల్ రజితతో పాటు, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రవణ్, నూనె శ్రీనివాస్, అనిత, కమలాకర్, ప్రవీణ్, బాలాజీ, రాజ్‌కుమార్, గౌస్, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలను సందర్శిస్తున్న కిషన్

రోడ్డు కబ్జాతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

- కాపాడాలని తహసీల్దార్ వినతి

గుమ్మడిదల, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల గ్రామంలోని రామ్‌నగర్ నుంచి ధర్మవరం వరకు వెళ్లే రోడ్డు ఓ రియల్ వ్యాపారి కబ్జా చేశారని రైతులు ఆరోపించారు. ఈ రోడ్డు రెవెన్యూ నక్షా ప్రకారం రికార్డుల్లో ఉందని, కానీ పాత రికార్డు ప్రకారం 800 ఎకరాల జాగీర్దార్ రామ్‌గోపాల్ రావు పొలంలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆ రోడ్డును కబ్జా చేసి గేట్ ఏర్పాటు చేసి సాగు చేసుకుంటున్నారని వివరించారు. దీంతో పంట పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. రోడ్డు కబ్జా చేయబడిన విషయం పట్ల చర్యలు తీసుకుని, రోడ్డు ఎవరికి చెందిందో విచారించి దానిని ప్రజలకు తిరిగి అందుబాటులోకి తేవాలని గురువారం రైతులు గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘాల సమైక్య ఉపాధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదా శివానందరెడ్డి, పలు రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

అన్యాయానికి గురవుతున్న గిరిజనులు

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



సభలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

కల్హేర్/సిర్గాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సమైక్య రాష్ట్ర పాలనలో గిరిజనులు అన్యాయానికి గురయ్యారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొన్నదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వగ్ధల్ గైర్హాన గిరిజన తండాను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన తండాకు వాగుపై వంతెన నిర్మించకుండా సంవత్సరాల తరబడి తాత్సారం చేయడం బాధాకరమని అన్నారు. అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆయన అన్నారు. తాను ప్రతి మూడు మాసాలకొకసారి ఈ ప్రాంతానికి వస్తుంటానని, అప్పటి వరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ ఎస్పీ సంజీవరావ్, నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి, గిరిజన నాయకులు ప్రకాష్ రాథోడ్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

సంగారెడ్డి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. పెన్షన్ పెంపు కోసం 42 లక్షల మంది ఎదురుచూస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని లేని పక్షంలో సరైన రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బస్వరాజ్, నర్సింహులు, ఉపాధ్యక్షులు జయలక్ష్మి, రాంచందర్, రాజ్‌కుమార్, రాములు, సభ్యులు శంకర్‌నాయక్, కృపవరం, లక్ష్మణ్, శివకుమార్, సుమలత, సయ్యద్, నరేష్, రాజశేఖర్, మెగులయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు



కంగ్టిలో గంగమ్మకు పూజలు చేస్తున్న ప్రజలు

నంగునూరు/కొల్చారం/కంగ్టి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వరుణుడి కరుణ కోసం దేవుణ్ణి వేడుకుంటూ, వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలోని దేవాలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు. కొల్చారం మండలం రాంపూర్ గ్రామస్థులు ఏడుపాయల ఘనపూర్ ఆనకట్టపై ఉన్న గంగమ్మతల్లికి పూజలు చేశారు. మండల కేంద్రమైన కంగ్టిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. స్వామివారి విగ్రహం పూర్తిగా నీటిలో మునిగే వరకు 1116 నిండు బిందెలతో నీళ్లు తెచ్చి గర్భగుడిని నింపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నంగునూరు మండలం గట్ల మల్యాలలో వర్షాల కోసం పూజలు చేస్తున్న భక్తులు

గిరిజన వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలి

- ఆడిటింగ్ అధికారి శ్రీనివాస్ చారి



చిన్నశంకరంపేట గిరిజన బాలుర వసతి గృహంలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారి శ్రీనివాస్ చారి

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన వసతి గృహంలో అవసరమైన అన్నీ సౌకర్యాలు కల్పించాలని స్టేట్ ఆడిటింగ్ అధికారి శ్రీనివాస్ చారి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. 2018 నుంచి 2025 వరకు వసతి గృహానికి సంబంధించిన నిధులు ఉపయోగించిన అంశాలపై రికార్డులను ఆడిట్ చేశారు. వసతి గృహానికి మరమ్మతులకు ఖర్చు చేసిన అంశాలపై హాస్టల్ వార్డెన్‌ను ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆడిట్ చేసిన వివరాల నివేదికను అధికారులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పలు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

పాపన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతను పర్యవేక్షించేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు సుమలత, రాణి, ఇలియాస్‌లు గురువారం మండల పరిధిలోని కొడుపాక, చిత్రియాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరుగు దొడ్ల వినియోగం, పారిశుద్ధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు, ఇంకుడు గుంతలు తదితర వాటిని పరిశీలించారు. పథకాల అమలు గురించి ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం మిన్‌పూర్, అర్కెల గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించనున్నారు. ఎంపీడీవో విష్ణువర్ధన్, ఇన్‌చార్జి ఎంపీవో పరమేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాబునాయక్, జగదీశ్ ఉన్నారు.



కొడుపాకలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు



రామాయంపేటలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

నీటి వృథా.. తప్పదు వ్యధ

- నల్లాలను బంద్ చేయని వైనం
- డ్రైనేజీ పాలవుతున్న తాగునీరు



నిజాంపేటలో మినీ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

రామాయంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నీటిని అడ్డగోలుగా వాడుతున్నారు. వానలు సరిగా లేక భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సి ఉంది. కానీ ప్రజలు ఇదేం పట్టించుకోకుండా యథేచ్ఛగా నీటిని వృథా చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నీటి ట్యాంకులు, మిషన్ భగీరథ నల్లాల నుంచి సరిపడా నీళ్లు పట్టుకున్నాక నల్లాలను బంద్ చేయకపోవడంతో నీరంతా గంటల తరబడి వృథాగా పోతున్నది. ఉచిత కరెంటు పథకాలు సైతం నీటి పొదుపునకు విఘాతం కలిగిస్తున్నాయి. ఇళ్లలో మోటార్లు ఆపకుండా, వ్యవసాయ బోర్లు ఆన్ చేసి వదిలేయడం వల్ల నీరు వృథా అవుతోంది. దీంతో కొన్ని ప్రాంతాల్లో వానకాలంలోనూ నీటి సమస్య తలెత్తుతున్నది. దీనిపై మిషన్ భగీరథ ఈఈ సంపత్ కుమార్ వివరణ కోరగా తాగునీటి వృథా నివారణకు నల్లాలకు చెర్రాలు బిగిస్తున్నామని తెలిపారు. నీటి వృథా కట్టడికి ప్రజలు సహకరించాలని కోరారు.

సిగాచి పరిశ్రమ ఘటన బాధ్యులపై చర్యలేవి? : సీఐటీయూ

పటాన్‌చెరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ పేలుడులో భారీ ప్రాణ నష్టం జరిగినా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. గురువారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు మానిక్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. అయినా యాజమాన్యంపై, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయకుండా పరోక్షంగా బాధ్యులైన అధికారులపైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రూ.కోటి నష్టపరిహారం ఇంతవరకు బాధిత కుటుంబాలకు అందలేదన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో పలు యూనియన్ల నాయకులు శంతన్‌కుమార్, రామకృష్ణ, రాజు, వెంకటేశ్, శ్రీకాంత్‌గౌడ్, జయరాం, రోషన్, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయ సహాయం అందిస్తాం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య

జహీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా వారికి పోక్సో, గృహహింస, వరకట్నం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. బాధితులు న్యాయ సహాయం కోరితే వారికి ఉచితంగా సలహాలు పొందుటకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సందర్శించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి లలిత కుమారి, సీడీపీవో అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

'ఔటర్'కు చేరాలంటే.. కంకర రోడ్డెక్కాల్సిందే!

- ఐదేళ్లుగా రహదారుల సమస్యకు దక్కని పరిష్కారం
- నిధులున్నా పట్టించుకోని అధికారులు, పాలకవర్గాలు

జిన్నారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లి, బొల్లారం పరిధిలో రెండు రహదారులకు ఐదేళ్లుగా మోక్షం లభించడం లేదు. ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కాలంటే కంకర రోడ్డే దిక్కవుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. కాజీపల్లి నుంచి ఔటర్ సర్వీస్ రోడ్డుకు చేరాలంటే గ్రామ శివారు నుంచి ఉన్న 500 మీటర్ల రోడ్డు కంకర, గుంతలమయంగా ఉన్నది. ఈ రోడ్డు ఉన్న స్థలం కొంతమేర హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. బొల్లారం మున్సిపల్ అధికారులు సీసీరోడ్డు కోసం నిధులు ఖర్చుచేయటం లేదు. ఈ రెండు శాఖల అధికారులు చర్చలు జరిపితే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. కాజీపల్లి పరిధిలోని జీఎంఆర్ కాలనీ నుంచి ఔటర్ రోడ్డు చేరాలంటే కంకర రోడ్డే దిక్కు. ఔటర్ సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న



కాజీపల్లి నుంచి ఔటర్ సర్వీస్ రహదారి వరకు ఐదేళ్లుగా ఉన్న కంకర రోడ్డు

ఇక్కడ 1,050 నివాసాలు, 3 వేల వరకు జనాభా ఉన్నారు. సర్వీస్ రోడ్డు నుంచి కాలనీ ప్రధాన రహదారి కంకర తేలి, గుంతల మయంగా మారి ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. అటు బొల్లారం మున్సిపాలిటీ, ఇటు కాజీపల్లి ప్రస్తుతం గడ్డపోతారం మున్సిపాలిటీలో కోట్లాది నిధులున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాకేం సంబంధం లేనట్టు ఉ ంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రెండు రహదారులను సీసీరోడ్లుగా అభివృద్ధి చేయాలని సమీప గ్రామాల ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

'నజారి' నిఘా

(5వ పేజీ తరువాయి)

బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. సర్వే ఎలా చేయాలి, ఓటర్లకు సంబంధించిన ఫారాలు ఎలా పూరించాలనే దానిపై బీఎల్‌వోలకు నాలుగురోజులుగా శిక్షణ ఇచ్చారు. జాబితా ప్రకారం ఇంటిలో సభ్యులున్నారా, రక్షణ రంగంలో పనిచేస్తున్నవారు అదే ఇంటిలో ఉంటున్నారా, అద్దెకు ఉన్నవారు మారారా వంటి వివరాలను సేకరిస్తారు. అద్దెకు ఉన్నవారు ఇతర ప్రాంతాలకు మారితే, షిఫ్టింగ్ ఆప్షన్‌తో దరఖాస్తు చేసుకోవాలి. శాశ్వతంగా మారినవారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు. అన్యాయంగా తమ పేరు తొలగించబడిందని భావిస్తే, నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఏడురోజుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యక్ష నిర్ధారణకు ఇంటింటి సర్వే

ఓటర్ల సంఖ్య ప్రత్యక్ష నిర్ధారణ చేయడానికి 25 నుంచి ఇంటింటి సర్వే చేయనున్నాం. అలానే ప్రస్తుతం రూపొందించిన నజారి నక్ష మ్యాప్‌లు సక్రమంగానే ఉన్నాయా లేదా, ఇంటికి వెళ్లినప్పుడు జాబితాలో ఉన్నట్టుగా మనుషులు ఉన్నారా వంటివి పరిశీలన చేస్తారు. బీఎల్‌వోలకు ఓటర్లకు సంబంధించిన ఫారాలు పూరించడం వచ్చా లేదా అనేది నాలుగు రోజులుగా పరిశీలన చేశాం.

- దేవుజ, ఎన్నికల అధికారి

న్యూస్ బాక్స్

'ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి'

రామచంద్రాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను కబ్జా కోరల నుంచి కాపాడి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని తెల్లాపూర్ చెరువు కట్ట మాజీ చైర్మన్ నర్సింహులు అన్నారు. తెల్లాపూర్‌లో వాల నారాయణరావు చేసిన లే అవుట్ ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జాచేసి నిర్మాణాన్ని చేపట్టారన్నారు. గురువారం మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశారు.

మూగజీవాలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశాం

నారాయణఖేడ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాధుల నివారణకు మూగజీవాలకు పూర్తి చేశామని పశుసంవర్ధక శాఖ ఖేడ్ ఏడీ డాక్టర్ గంగాధర్ తెలిపారు. గురువారం ఖేడ్ లోని పశు వైద్యశాలలో పశుపోషకులు, రైతులు తీసుకొచ్చిన జీవాలకు వ్యాక్సినేషన్ చేశారు.

పూడిక తొలగింపు

నారాయణఖేడ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. పోలీస్ స్టేషన్ ముందు రోడ్డు పక్కన గల మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. కరస్‌గుత్తి మార్గంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. పనులను శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

నర్సాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలతో పాటు పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తున్నదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

'ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు చెల్లించాలి'

చేగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడునెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే చెల్లించాలని సంఘం మండల అధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ యూనియన్ పిలుపుమేరకు చేగుంటలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే వారాంత సమావేశాన్ని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు సన్మానం

నారాయణఖేడ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు బానోత్ హుస్సేన్‌నాయక్ గురువారం సిర్గాపూర్ మండలం గైర్హాన్‌తండాకు వచ్చిన సందర్భంగా ఖేడ్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్ కురుమ, పట్టణ అధ్యక్షుడు రాజు గౌడ్, నాయకులు పట్నం మాణిక్, మేకల జ్ఞానేశ్వర్, ఏక్‌నాథ్, లోకేష్, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పండరి సన్మానించారు.

'బాల్య వివాహాలను అరికట్టాలి'

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిర్మూలించాలని తూప్రాన్ సబ్ డివిజన్ షీటీం అధికారి గంగామణి అన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని హైస్కూల్లో బాల్య వివాహాల నిర్మూలనపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇంకెప్పుడు ఇస్తారు.?

సంగారెడ్డి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఇంకెప్పుడు ఇస్తారని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం తహసీల్దార్ జయరాంనాయక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది, దాసుగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు.

'యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'

జహీరాబాద్, జూలై 1 7(ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, రూరల్ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని రంజోల్‌లో వాకింగ్ వారియర్స్ పేరుతో యువతకు టీషర్టులు, షూలను పంపిణీ చేశారు.

లీకేజీలతో నీటి ఎద్దడి

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో మూడురోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో మంచి నీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు చెప్పారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపవడంతో వ్యవసాయ బోరు బావుల నుంచి నీళ్లు తీసుకొస్తున్నట్లు మహిళలు పేర్కొన్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ విలీన పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట రేయిన్‌బో కాలనీకి తాగునీటి సరఫరాను ప్రారంభించి మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డు పరిసర గ్రామాల్లో మెరుగైన తాగునీటి సరఫరా కోసం హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ పరిధిలోకి తెచ్చామన్నారు. గతంలో నీటి ఎద్దడికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో నేడు 24 గంటలు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అన్ని కాలనీలకు, అపార్ట్‌మెంట్‌లకు, గ్రామాలకు దశలవారీగా కనెక్షన్‌లు ఇచ్చి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. పెరిగిన నీటి



కిష్టారెడ్డిపేట రేయిన్‌బో కాలనీకి మంచినీటి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

డిమాండ్‌కు అనుగుణంగా మరో 25 ఏళ్లపాటు సమస్య రాకుండా ముందు చూపుతో మున్సిపాలిటీ పరిధిలో నాలుగు భారీ రిజర్వాయర్లను నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జడ్పీటీసీఈ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దు

- సంగారెడ్డి డీపీవో సాయిబాబా

కంది, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నర్సరీల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దని డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి) టి.సాయిబాబా అన్నారు. కంది మండలంలోని చేర్యాల గ్రామాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామపంచాయతీ ఆస్తుల నిర్వహణపై సమీక్షించారు. గ్రామపంచాయతీ రికార్డులు, పరిశుభ్రత పురోగతి, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటికను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలన్నారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, పరిశుభ్రత పట్ల అలసత్వం చూపినట్లయితే తగిన తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ పరిశీలనలో మండల పంచాయతీ అధికారి మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సుధీర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చేర్యాలలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

రౌడీ రాజకీయాలు మానుకోవాలి : క్రాంతికిరణ్

రేగోడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కార్యకర్తలు రౌడీ రాజకీయాలు మానుకోవాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం రేగోడు మండలంలోని దోసపల్లి గ్రామంలో ధ్వంసమైన పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దౌర్జన్య పాలన ఎక్కువైందని అన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి పనులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. దోసపల్లి పల్లె ప్రకృతివనంలో చెట్లను తొలగించి కిలోమీటర్ల దూరంలో పడేశారు. బోర్డులను తొలగించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు గురునాథ్‌రెడ్డి, సిద్ధారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు. అంతకుముందు మర్పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు బండి నాగయ్య మృతి చెందిన విషయం తెలుసుకొని, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.



దోసపల్లిలో ధ్వంసమైన పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న క్రాంతికిరణ్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం : డీఎస్పీ

కోహీర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆయన ప్రారంభించి మాట్లాడారు. సొంత నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన గ్రామ పెద్దలు చర్ల శశిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు నాగెల్లి మనోహర్‌ను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల స్వచ్ఛత అందరి బాధ్యత అని మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామాలను సందర్శించి పలు వీధులను పరిశీలించి, మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జీపీ రికార్డులను పరిశీలించారు.

తెల్లాపూర్‌లో అత్యవసర వైద్య సేవలు అవసరమే : ఎంపీ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లో దీర్ఘకాలంగా అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ అవసరమేనని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీమేరకు సొంత నిధులతో అంబులెన్స్ అందించడం జరుగుతుందన్నారు. అంబులెన్స్‌ను తెల్లాపూర్ మున్సిపల్ ఆవరణలో ఎంపీ ప్రారంభించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ లేకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, సభ్యులు పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కోసం 7386759108కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ అఖిల్, బీజేపీ నాయకులు రాంబాబుగౌడ్, నరేందర్‌రెడ్డి, ఎస్.రాజు పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన విద్యార్థులు



పొలంలో సందడి చేస్తున్న పాఠశాల విద్యార్థులు

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం పొలం బాటపట్టారు. పొలంలో నాట్లు వేసే విధానం, పంట సాగులో ఉపయోగించే పద్ధతులు, ఎరువుల వినియోగం వంటి వాటి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి మాట్లాడుతూ వ్యవసాయ రంగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామన్నారు.

స్థానిక సంస్థల్లో యువతకు అవకాశమివ్వాలి

జహీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు 25 శాతం అవకాశం కల్పించాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి తామెంతో కృషిచేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, నరేష్‌బబ్లూ, జగదీశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థినుల హాజరు శాతం తగ్గకుండా చూడాలి'

సంగారెడ్డి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల హాజరు శాతం తగ్గకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి లలిత కుమారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. వంటశాలలో ఆహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందజేయాలన్నారు. 561 మంది విద్యార్థినులకుగాను 46 మంది గైర్హాజరవడంపై ఆమె మండిపడ్డారు. విద్యాలయంలోని పలు సమస్యలను ప్రిన్సిపాల్ ప్రిసిల్లా ఆమె దృష్టికి తీసుకెల్లాళ్లారు. అదేవిధంగా కస్తూర్బా విద్యాలయాన్ని కూడా సందర్శించారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

- పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సురేష్, మహేష్



సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సురేష్, మహేష్

సంగారెడ్డి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సురేష్, మహేష్ అన్నారు. సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీకాంత్, నితిన్, ముకేందర్, అంబర్‌సింగ్, మన్నీత్ పాల్గొన్నారు.

కబ్జాలను పట్టించుకోరా..? : నరోత్తం

జహీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా నీటి ప్రవాహానికి వీలుగా ఉన్న వాగులు, నాళాలు కబ్జాలకు గురవుతుంటే అధికారులు మౌనం వహించడం సరికాదని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలకు సమీపాల్లో వెడల్పుతో ఉన్న వాగులు, నాళాలు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. అధికారులు సైతం కబ్జాదారుల నుంచి మామూళ్లకు అలవాటుపడి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జహీరాబాద్ మండలం గోవిందాపూర్ నుంచి ప్రారంభమైన దోబీవాగు జహీరాబాద్ మీదుగా వెళ్తూ నారింజ ప్రాజెక్ట్‌లో కలుస్తుందని, దాదాపు మూడు కిలోమీటర్ల ప్రవాహం ఉంటుందన్నారు. వాగు పొడవునా ఎక్కడ చూసినా కబ్జాకు గురైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరోత్తం

పేదలందరికీ సంక్షేమ పథకాలు

రేగోడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతీ నిరుపేదకు అందుతున్నాయని టీపీసీసీ మెంబర్ మున్నూరి కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావ్ తెలిపారు. గురువారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గంలోని రేగోడు, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లో బీడు భూములు సాగులోకి తేవడానికి సింగూర్ జలాలను అందించేందుకు మంత్రి నిధులు మంజూరు చేయించారని అన్నారు. దీంతో రేగోడు మండలంలోని పదివేల ఎకరాలకు సాగు నీరు అందనుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేగోడు మాజీ ఎంపీటీసీ నరేందర్, పీర్యనాయక్, శ్రీధర్ గుప్తా, రాధాకిషన్, చోటుమియా, శ్రీనివాస్‌రెడ్డి, సంగమేశ్వర్, నర్సింలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆదాయం మిత్తికే సరి

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజల మీద మోపి పాలన నుంచి తప్పుకోగా, వాటిని నెమ్మదిగా సరిచేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోగా ఆపార్టీ నాయకుల ఆస్తులు పెంచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. మెదక్‌లో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మహిళలు స్వీయ సమృద్ధి సాధించడానికి ప్రతీ రంగంలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. పేద, గ్రామీణ మహిళలు రిజర్వేషన్లను సక్రమంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళా శక్తి రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బెల్ట్‌షాపులను బంద్ చేయించాలని అదే వేదిక మీద ఉన్న మంత్రి వివేక్‌ను కోరారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందనడం హాస్యాస్పదమన్నారు. పదేళ్ల పాలనలో నాటి సీఎం కేసీఆర్ ఏడుపాయల ఆలయం, మెదక్ చర్చి సందర్శించిన సందర్భమే లేదని వాపోయారు. నిరుపేదల సంక్షేమమే పరమావధిగా రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఆర్డీవో మహిపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మహిళా పొదుపు సంఘాల సభ్యులు, పథకాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి గైర్హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు. నర్సాపూర్‌లో మంత్రికి స్వాగతం పలికే క్రమంలో పోటాపోటీగా వ్యవహరించడంతో నర్సాపూర్, శివ్వంపేట మండలాల నాయకుల మధ్య వాగ్వాదం చెలరేగింది. పోలీసులు కలుగ చేసుకుని వారికి సర్దిచెప్పాల్సి వచ్చింది.

విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

మెదక్/మెదక్ అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంథాలయ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి, జిల్లా అధికారులతో కలిసి సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యా వైద్యం, వ్యవసాయం, ఉద్యానవనం, సంక్షేమం, పరిశ్రమలు, ఇందిరమ్మ ఇళ్లు, వివిధ శాఖల ప్రగతి పురోగతిని అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత లేకపోవడంతో అర్హులైన పేద కుటుంబాలు పథకానికి దూరమవుతున్నారని ఎంపీ రఘునందన్‌రావు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ పరిధిలో కలపాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి టీఎన్జీవో, రెవెన్యూ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు నరేందర్, మహేందర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లా రాజన్న జోన్‌లో ఉండడంతో విద్యార్థులు, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని వివరించారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నేరవేర్చాలని కోరారు.

రెండు కళ్లలా అభివృద్ధి, సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

చేస్తామన్నారు. మెదక్ నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సంఘ సేవకులు, కుల సంఘాల నేతలు, పలు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి పర్యటన జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఈ కార్యక్రమంలో మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్ చేదు అనుభవం

రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన కాంగ్రెస్ సభకు హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రసంగిస్తుండగా.. ఓ వ్యక్తి మంత్రిపైకి మక్కబుట్ట విసిరాడు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనందునే నిరసనగా విసిరినట్లు తెలుపగా.. వెంటనే పోలీసులు అతడిని సభ నుంచి బయటకు తీసుకెళ్లారు.

బ్యాతోల్‌లో ఘనంగా బోనాలు



బ్యాతోల్‌లో గ్రామ దేవతల ఊరేగింపులో మాజీ జడ్పీటీసీ తేర్పల్లి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిరీష

కంది/జిన్నారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కంది మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గురువారం బోనాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ తేర్పల్లి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో గ్రామ దేవతల విగ్రహాలను, పొట్టేళ్ల ఫలహారబండిని ఊరేగించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామ దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మలకు సమర్పించారు. అలాగే జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం జిన్నారం సహా పలు ఇతర గ్రామాల్లో పోచమ్మ ఆలయం వద్ద భక్తులు బోనాల ఊరేగింపును నిర్వహించారు.